మొక్కలు పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

మైదుకూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి, పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా ప్రిన్సిపల్ న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. శనివారం మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఆమెతోపాటు డీఎల్ఎస్ఏ జడ్జి బాబా ఫకృద్దీన్, మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఖాజామొయినుద్దీన్‌లు మొక్కలు నాటారు. అంతకుముందు మైదుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల వెంకటయ్య, సెక్రటరీ కొట్టే జయరామ్, న్యాయవాదులు న్యాయమూర్తులకు ఘన స్వాగతం పలికి, వారిని సత్కరించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ అనేక కాలుష్యాల వల్ల పర్యావరణం దెబ్బతిని మానవాళి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశులు, అర్బన్, రూరల్ సీఐలు మస్తాన్, శ్రీనాథ్‌రెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, ప్రొద్దుటూరు, వనిపెంట అటవీ రేంజి అధికారులు హేమాంజలి, ప్రణీత్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



మైదుకూరు : కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో జడ్జిలు



ఖాజీపేట : చెట్ల గొప్పతనంపై విద్యార్థుల ప్లకార్డుల ప్రదర్శన

చెట్లతోనే మానవాళి మనుగడ

బి.కోడూరు : చెట్లతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ తెలిపారు. శనివారం బి.కోడూరులో ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు భారతీయ జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ జయంతి సందర్భంగా అమ్మకు ఒక చెట్టు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు తిప్పలూరు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్ల ఆవశ్యకత, చెట్ల సంరక్షణ, చెట్ల వలన కలిగే లాభాల గురించి వివరించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.లక్ష్మీనారాయణరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బద్వేలు అసెంబ్లీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, స్థానిక టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు గోడిరమణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, మేకవారిపల్లె మాజీ సర్పంచ్ శేషారెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం

ఖాజీపేట : చెట్లను అందరం కలసి పెంచుదాం.. భవిష్యత్‌కు మంచి పర్యావరణాన్ని అందిద్దామని భీరం విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం చెమ్ముళ్ళపల్లెలో ఉన్న భీరం ఇంటర్నేషనల్ స్కూల్‌లో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మొక్కలు నాటించారు. అనంతరం చెట్లను పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చెట్లను తొలగించుకుంటూ పోతే కల్గే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్వేత, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్‌తోపాటు విద్యార్థులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకు గుర్తుగా..

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని మున్సిపల్ పార్కులో శనివారం ఏక్‌పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకధార నరేంద్ర ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు వంకధార నరేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మకు గుర్తుగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సీపీ జయలక్ష్మి, పట్టణాధ్యక్షురాలు నల్లదిమ్ము కుమారి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జున, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చెన్న మోహన్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యక్షులు శివనాగిరెడ్డి, శివకుమార్‌యాదవ్, కార్యదర్శి శ్రీశ్రీ చిన్న, తోటం శెట్టి శ్రీను, దస్తగిరి, శివశక్తి పుల్లారెడ్డి, వెంకటసుబ్రహ్మణ్యం, శశిధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : మున్సిపల్ పార్కులో బీజేపీ నాయకులు



బి.కోడూరు : మొక్కను నాటుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

పాఠశాలల అభివృద్ధికి కృషి



పాఠశాలను సందర్శించిన కర్ణాటక రిటైర్డ్ వైద్య, ఆరోగ్య సహాయ సంచాలకుడు కాశిరెడ్డి

కలసపాడు : పాఠశాలల అభివృద్ధికి ముందుకు వచ్చిన డాక్టర్ గొంగల్‌రెడ్డి కాశిరెడ్డి దాతృత్వం అభినందనీయమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి అన్నారు. మండలంలోని ఎగువ తంబళ్ళపల్లె గ్రామానికి చెందిన దివంగత గొంగల్‌రెడ్డి వెంకటపతిరెడ్డి, పుల్లమ్మ దంపతుల కుమారుడైన కాశిరెడ్డి కర్ణాటక రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ సహాయ సంచాలకులుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేయడం జరిగిందన్నారు. శనివారం ఎగువ రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎగువ తంబళ్ళపల్లెలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను కాశిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా దాత కాశిరెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామానికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు విద్యాపరంగా అభివృద్ధి చెందాలని భావించినట్లు తెలిపారు. ఎగువ రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాలు నిర్మాణం, అలాగే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వంటగది నిర్మాణం కోసం సుమారు రూ.13 లక్షలు పైగా ఆర్థిక సాయం చేయాలనే తలంపుతో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన ప్రాంతానికి సేవలు అందించాలనే గొప్ప ఆలోచనతో ముందుకు వచ్చిన కాశిరెడ్డి లాంటి వారు అరుదుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కమాల్, ఉపాధ్యాయులు రామక్రిష్టారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఐలు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధి శీలంవారిపల్లె, వల్లెరవారిపల్లె ప్రాథమిక పాఠశాలల్లోని 50 మంది విద్యార్థులకు డెమొక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మానుగుంట రవిశంకర్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందించిన సహకారాన్ని అందిపుచ్చుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అలాగే విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీకి సహకరించిన ఎన్ఆర్ఐలు డి.సాయిశ్రీలక్ష్మి, డి.మల్లికార్జుననాయుడులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బి.వరలక్ష్మి, ఎంఈఓ రఘురాములు, నాయకులు వెంగల్‌రెడ్డి, ప్రభాకర్, ఉపాధ్యాయులు శశికళ, రామచంద్రయ్య, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట ఎంపీడీఓగా రమణ



సుమిత్రమ్మ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న రమణ

ఖాజీపేట : ఖాజీపేట ఎంపీడీఓగా రమణ నియమితులయ్యారు. శనివారం రోజున ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా ఖాజీపేటకు వచ్చిన ఎంపీడీఓ సుమిత్రమ్మ బదిలీ పై వెళ్లడంతో.. సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రమణను ఎంపీడీఓగా ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక



భవ్యశ్రీ



జస్వంత్

పోరుమామిళ్ల : మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భవ్యశ్రీ, జస్వంత్‌లు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ – 2023) పోటీ పరీక్షల్లో విజయం సాధించారు. జూన్ నెలలో వెలువడిన ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో ఈ ఇద్దరు విద్యార్థులు ఎంపికయినారని ప్రధానోపాధ్యాయులు బాలఅంకిరెడ్డి శనివారం తెలిపారు. 8 వ తరగతిలో ఈ విద్యార్థులు పరీక్ష రాయగా ఫలితాలు ఇప్పుడు వెలువడ్డాయని, ఎంపికయిన ఇద్దరు విద్యార్థులకు, 9,10, ఇంటర్ రెండు సంవత్సరాల్లో రూ.12 వేల వంతున రూ.48 వేల ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఎస్టీయూ అధ్యక్షులు పుల్లయ్య మాట్లాడుతూ ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. నాలుగు సంవత్సరాలు ఆ విద్యార్థులకు ప్రభుత్వ ఆర్థిక సాయం అందుతుందన్నారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసిన ఉపాధ్యాయులను పుల్లయ్య అభినందించారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్ మునీశ్వర్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్ జవహర్‌బాల కేంద్రం విద్యార్థులు అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనపరచి బంగారు పతకాలు సాధించారు. నేపాల్ రాజధాని ఖాట్మండులో ఇటీవల ఇండో నేపాల్ అంతర్జాతీయ తైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్–12 సబ్‌జూనియర్ 33 కిలోల బాలుర విభాగంలో ఎం.సుదీప్‌కుమార్ ప్రథమ స్థానం, సీనియర్ బాలుర 55 కిలోల విభాగంలో ఎస్.శివనాథ్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. వీరిని మాస్టర్ మునీశ్వర్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

వృద్ధాశ్రమంలో అల్పాహారం



అల్పాహారం వడ్డిస్తున్న షాకీర్ హుసేన్

ప్రొద్దుటూరు : స్థానిక మదర్ థెరిస్సా షబ్బీర్ వృద్ధాశ్రమంలో శనివారం ఉదయం ఏపీ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు షాకీర్‌హుసేన్.. ఏకే మొహిద్దీన్ 4వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు ఏకే ఆలీ అక్బర్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ లూయిస్ పాశ్చర్ తొలిసారిగా యాంటిరేబిస్ టీకాను విజయవంతంగా ఒక బాలుడికి ఇచ్చి ప్రాణాలు కాపాడినందుకు గుర్తుగా జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. పెంపుడు జంతువుల ద్వారా అనేక వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. యజమానులు పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. జూనోటిక్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 122 పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటి రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.అనూష, పశువైద్య చికిత్స సముదాయం విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ రేవతి, డాక్టర్ శివ సుదర్శన్, డాక్టర్ విద్యాసాగర్, తృతీయ, ఆఖరి సంవత్సరం పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ శ్రీనివాసప్రసాద్



మైదుకూరు : కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి

వ్యాధులు రాకుండా చూసుకోవాలి

మైదుకూరు : పెంపుడు జంతువుల ద్వారా వ్యాధులు రాకుండా యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అన్నారు. ఆ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులను సరైన పద్ధతుల్లో పెంచాలని తెలిపారు. వాటి ద్వారా వచ్చే అనేక వ్యాధులను పలు జాగ్రత్తలతో నివారించవచ్చని పేర్కొన్నారు. జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సి.నరసింహారావు మాట్లాడుతూ 1885 జూలై 6న లూయిస్ పాశ్చర్ పిచ్చికుక్క కరిచిన బాలుడికి మొట్టమొదటి సారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చి ప్రాణాలు కాపాడారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

కలసపాడు : స్థానిక పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్‌డే సందర్భంగా కుక్కలు, పిల్లులకు పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జూనోసిస్ వ్యాధులు అనగా జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాధి రావడం అని అన్నారు. ఈ జూనోటిక్ వ్యాధులలో చాలా రకాల జబ్బులు, బ్యాక్టీరియా, వైరస్, ప్రోటోజోవల్, ఫంగస్ జబ్బులు ఉన్నాయన్నారు. వీటిలో ముఖ్యంగా రేబిస్ పిచ్చికుక్క కాటు వ్యాధి చాలా డేంజర్ వ్యాధి అని అన్నారు. కుక్కకాటు, పిల్లికాటు ద్వారా మనుషులకు వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వైరస్‌కు టీకా మాత్రమే ఉందన్నారు. జబ్బు వచ్చినచో మరణం తథ్యం కావున కుక్క కరిచిన వెంటనే సమీప పీహెచ్‌సీలో 5 రోజులు టీకా వేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి జబ్బుల బారి నుంచి కాపాడుకోవాలని తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి పేర్కొన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని రమణ మహర్షి హైస్కూల్‌లో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం 1985–86లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతులుగా తీర్చిదిద్దిన పాఠశాలకు తమ వంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కోవాలని, విద్య ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. పూర్వవిద్యార్థి, చాపాడు ఎంఈఓ వంశీకృష్ణ మాట్లాడుతూ తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు 13 ఏళ్లుగా సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.20 వేలు అందించారు. అలాగే ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థుల సౌకర్యార్థం రూ.40 వేల విలువ చేసే ఆటసామగ్రి, మైక్‌సెట్, సైన్స్ పరికరాలు, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు రవిప్రకాష్, సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థి ప్రభు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న ఎంఈఓలు, పూర్వ విద్యార్థులు

కార్మికులపై పని భారం తగ్గించాలి

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులపై పనిభారం తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రఘునాథరెడ్డికి ఏఐటీయూసీ నాయకులు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పర్మనెంట్ సిబ్బంది 101, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 350, కోవిడ్ కార్మికులు 93, నగర దీపికలు 25 మంది మొత్తం 573 మంది పని చేస్తున్నారని తెలిపారు. రిటైర్డు అయిన వారి స్థానాల్లో కొత్తవారిని నియమించలేదని అధికారులు చెబుతున్నారన్నారు. చాలా మంది కార్మికులు సచివాలయల్లో అటెండెన్స్ వేసుకుని జారుకుంటున్నారన్నారు. దీని వల్ల పని చేసే కార్మికులపై భారం పెరిగిందని తెలిపారు. అధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయనిర్మల, రవిప్రసాద్, బోదనం చిన్న ఓబులేసు, నిర్మల, ప్రమీల, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ఆర్టీఓ కార్యాలయం తనిఖీ



ఆర్టీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఆర్టీఓ కార్యాలయాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రవాణాశాఖలో జరుగుతున్న వాహనాల ఓనర్‌షిప్ ట్రాన్స్‌ఫర్, లైసెన్సు, ఎల్ఎల్ఆర్‌ల జారీ తదితర వాటి గురించి ఆర్టీఓ మురళీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చే వాహనదారుల నుంచి ఇక్కడి అధికారులు డబ్బు అడుగుతున్నారా అని అక్కడున్న వారిని ఎమ్మెల్యే అడిగారు. రవాణాశాఖపై ఆర్టీఓ, ఎంవీఐలతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చర్చించారు.

చౌకబియ్యం అక్రమ రవాణాపై కలెక్టర్ దృష్టి సారించాలి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో జరుగుతున్న చౌకబియ్యం అక్రమ రవాణాపై కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ శివశంకర్ దృష్టి సారించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చౌక బియ్యం అక్రమ రవాణా గురించి గతంలో తహసీల్దార్‌ను హెచ్చరించినా చర్యలు కనిపించలేదన్నారు. ప్రొద్దుటూరు నుంచి కర్ణాటక రాష్ట్రానికి బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రేషన్ బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి తరలిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి ఆలోచనతో పేదలకు ఒక్క రూపాయికే బియ్యం ఇస్తుంటే దళారులు వాటిని కొని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్నారు. ఇందులో ప్రధాన సూత్రదారులెవరో రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలుసునని చెప్పారు. అందరికీ మామూళ్లు పోతున్నాయన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బియ్యం అక్రమ రవాణాను అరికడతానని ఎమ్మెల్యే చెప్పారు.

నిరాశ్రయుల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి



నిరాశ్రయుల వసతి గృహం సందర్శనలో జడ్జి వై.జె.పద్మశ్రీ

బద్వేలు అర్బన్ : నిరాశ్రయుల సంరక్షణను సెంటర్ నిర్వాహకులు బాధ్యతగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ పేర్కొన్నారు. స్థానిక తెలుగుగంగ కాలనీలోని నిరాశ్రయుల వసతి గృహాన్ని ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరాశ్రయులను ఆదరించడం సామాజిక సేవ అని, నిరాశ్రయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిరాశ్రయుల వసతిగృహంలో ఉన్న వృద్ధులతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడంతోపాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అలాగే వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నిరాశ్రయుల వసతిగృహం నిర్వాహకులు రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ జయంతి

పోరుమామిళ్ల : బీజేపీ నేత డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మండల బీజేపీ అధ్యక్షుడు నాగేంద్ర ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ముందుగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఇన్‌చార్జి బొజ్జా రోశన్న, కో కన్వీనర్ పల్లెంశెట్టి పండరి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు రమణాచారి, మండల కార్యదర్శి జయరాం, కిసాన్‌మోర్చా అధ్యక్షులు రవీంద్ర, మండల నాయకులు గురయ్య, సుబ్బారావు, రమణ, పాపయ్య, సోమిరెడ్డి, మస్తాన్, రాజా తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

10న మండల సమావేశం

మైదుకూరు : మైదుకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

రైతులకు సహకార సంఘాల చేయూత



ప్రొద్దుటూరు : ప్రతిజ్ఞ చేస్తున్న సహకార శిక్షణ కేంద్రం అధికారులు, శిక్షణార్థులు



చాపాడు : అల్లాడుపల్లె రైతు సహకారం సంఘం బ్యాంకు వద్ద సిబ్బంది, రైతులు

ప్రొద్దుటూరు : స్థానిక సహకార శిక్షణ కేంద్రంలో శనివారం 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సహకార సంఘాలు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అమలు చేయడానికి అన్ని సంస్థలు ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆహార భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ శిక్షణార్థులు సహకార సంఘాల్లో పని చేస్తున్న సిబ్బంది కనుక వివిధ అంశాల్లో నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విధి నిర్వహణలో ఉపయోగించి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీసీఎం అండ్ సీపీ విద్యార్థులు, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : స్థానిక అల్లాడుపల్లె రైతు సహకారం సంఘం బ్యాంకు వద్ద అంతర్జాతీయ సహకార దినోత్సవం–2024 వేడుకలు నిర్వహించారు. బ్యాంకు ఎదుట రైతు సహకార సంఘం జెండాను సీఈఓ అంకయ్య ఎగుర వేశారు. అనంతరం ఈయన మాట్లాడుతూ.. వ్యవసాయం చేసుకునే రైతులకు అన్ని రకాలైన రుణాలు ఇస్తామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం బ్యాంకు అభివృద్ధికి సహకరించాలన్నారు. వ్యవసాయ చేసుకునే ప్రతి రైతు పంట రుణాలను పొందవచ్చన్నారు. ఇప్పటికే ఉన్న రైతులతోపాటు కొత్త రైతులు కూడా సహకార బ్యాంకులో సభ్యత్వం తీసుకుని రుణాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం బ్యాంకు సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ఖాజీపేట : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య అధికారి డాక్టర్ అయిషా సుల్తానా తెలిపారు. సీజనల్ వ్యాధులు, దోమల వల్ల కలిగే నష్టాలపై శనివారం మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నివారణకు వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలని అన్నారు. ఇంటి బయటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

